లాసన్స్‌బే పార్కుకు కొత్త శోభ

- శిథిలమైన ఐరన్ కంచె స్థానంలో తీరం వైపు రక్షణ గోడ నిర్మాణం
- ముఖద్వారం ఆధునికీకరించిన జీవీఎంసీ అధికారులు



పార్కులో సేదదీరుతున్న సందర్శకులు



శిథిలమైన ఐరన్ రక్షణ గోడ



పూర్తి స్థాయిలో గోడ నిర్మాణం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులోని లాసన్స్ బే పార్కు కొత్త శోభతో కళకళలాడుతోంది. చుట్టు పక్కల ఉన్న కాలనీల ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ ఈ పార్కును 2017లో నిర్మించింది. ఈ పార్కుకు స్థానికులతో పాటు నగర వాసుల తాకిడి ఎక్కువగానే ఉంది. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున ఇక్కడకు వచ్చి సేద తీరుతున్నారు. అయితే పార్కు నిర్వహణపై జీవీఎంసీ ఉదాసీనంగా వ్యవహరించడంతో కొన్నాళ్లుగా పరిసరాలు అధ్వానంగా మారాయి. చాలా చోట్ల పచ్చదనం కనుమరుగు కాగా.. సముద్రం వైపు నిర్మించిన రక్షణ గోడ పూర్తిగా శిథిలమైంది. దీంతో పార్కు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు పార్కు ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. తొలుత పార్కు చుట్టూ ఐరన్‌తో రక్షణ గోడ నిర్మించారు. దీంతో పాటు జాలరిపేట వైపు ఉన్న ప్రధాన ద్వారాలు సైతం పూర్తిగా ఐరన్‌తో ఏర్పాటు చేశారు. అయితే ఈ పార్కు సముద్ర తీరాన్ని ఆనుకుని ఉండడంతో ఉప్పునీటి గాలులకు ఐరన్ తుప్పు పట్టిపోయింది. తీరం వైపు రక్షణ గోడతో కూడిన ఇనుప బద్దెలతో పాటు కంచె కూడా పూర్తిగా తుప్పుపట్టి శిథిలమైపోయింది. ఈ క్రమంలో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే పరిస్థితి ఏర్పడింది. సందర్శకులు, స్థానికులు వినతుల మేరకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. తీరం వైపు పూర్తి స్థాయిలో గోడ నిర్మాణం చేపట్టారు. శిథిలమైన ఇనుప రక్షణ గోడ స్థానంలో పూర్తిస్థాయిలో కాంక్రీట్‌తో కూడిన ప్రహరీ నిర్మించారు. ప్రధాన ద్వారం వైపు కూడా పూర్తి స్థాయిలో గోడ ఏర్పాటు చేశారు.పార్కులో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాలు



షిర్డీ సాయిబాబా

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఈ ఆలయాన్ని కమిటీ సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలు, పచ్చని కమ్మలతో అలంకరించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ చీఫ్ సెక్రటరీ వానపల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం పురవీధుల్లో బాబా రథోత్సవం, 12న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్చారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 13న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కలశ పూజ, 11 గంటలకు బాబాకు అన్నాభిషేకం, మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు

రూరల్ తహసీల్దారు పాల్ కిరణ్ బదిలీ



బదిలీ అయిన తహసీల్దారు కిరణ్



కొత్త తహసీల్దారు రమణయ్య

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు పాల్ కిరణ్ గురువారం బదిలీ అయ్యారు. ఆయనను రూరల్ మండలం నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పాడేరు మండలం తహసీల్దారు రమణయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు రమణయ్య గురువారం సాయంత్రం ఇక్కడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. కిరణ్ కూడా కలెక్టర్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. పాల్ కిరణ్ రూరల్ తహసీల్దారుగా ఆరు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి నుంచి తనను రిలీవ్ చేయాలని ఇటీవల కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో బదిలీ చేసినట్టు తెలిసింది.

అప్పుఘర్‌లో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, పౌష్టికాహారం అందుకున్న మహిళలతో క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–9 అప్పుఘర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సిద్దార్థ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గర్భిణులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వీఎంసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు పి.శంకర్, క్లబ్ ప్రతినిధులతో కలిసి 30 మంది మహిళలకు దుప్పట్లు, గుడ్లు, పాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు ఊరట

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులు సుమారు 30 మంది వరకు జ్వరాల బారిన పడ్డారు. వారిని వారం క్రితం ఇళ్లకు పంపించేశారు. బుధవారం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల కు మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల కోసం జ్వరం తగ్గిన విద్యార్థులు ఇళ్ల నుంచి గురుకులానికి చేరుకున్నారు. జ్వరం తగ్గని సుమారు 15 మంది విద్యార్థులు ఇంటి వద్దే ఉండిపోయారు. దీంతో వారు పరీక్షలు రాయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆ విద్యార్థులకు మరోసారి పరీక్షలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించినట్లు గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి తెలిపారు. దీంతో జ్వరపీడిత విద్యార్థులకు ఊరట లభించింది.

శాస్త్రోక్తంగా మృత్యుంజయేశ్వర విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్ఠించిన మృత్యుంజయేశ్వర లింగం



శిఖర కలశ ప్రతిష్ట చేస్తున్న అర్చకులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమంలో పునర్నిర్మించిన శివాలయంలో శ్రీమృత్యుంజయేశ్వర విగ్రహ ప్రతిష్ట గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీవిష్ణు సేవానందగిరి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రతిష్టాపన కార్యక్రమాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం 8.47 గంటలకు భక్తిశ్రద్ధలతో శివలింగ ప్రతిష్ట చేశారు. జగద్గురు మఠం శ్రీలలితాంబిక పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి చేతుల మీదుగా ఈ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నందీశ్వర, ధ్వజ స్తంభం, శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు చేశారు. ప్రతిష్ట కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని అభిషేకం చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న హోమాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

గెడ్డ ఆక్రమణకు బ్రేక్

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: హెల్త్‌సిటీలో శ్రీసత్య ఆస్పత్రి యాజమాన్యం పూనుకున్న గెడ్డ ఆక్రమణకు రూరల్ రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. ఈ ఆస్పత్రి వెనుక గేటు ఏర్పాటు కోసం గెడ్డను ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టారు. ఇందు కోసం గెడ్డలో కాంక్రీట్ కూడా వేసేశారు. దీనిపై ×ఆస్పత్రి వెనుక గేటు కోసం అడ్డదారి÷శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రూరల్ రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు పాల్ కిరణ్ ఆదేశాలతో వీఆర్వో సత్యం దొర సంబంధిత సచివాలయం సిబ్బందితో ఆస్పత్రి వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. ఇక్కడ గెడ్డను ఆక్రమించి కాంక్రీట్ వేసి గోడ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్ధారించారు. దీంతో ఈ పనులు వెంటనే నిలిపివేయాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. ఇంత వరకు గెడ్డలో చేపట్టిన కాంక్రీట్‌ను స్వయంగా తొలగించేయాలని, లేదంటే జీవీఎంసీ సిబ్బందితో తొలగించి ప్రభుత్వ స్థలం, గెడ్డ ఆక్రమణ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు పనులు నిలిపేశారు. ఒకటి, రెండు రోజుల్లో గెడ్డలో వేసిన కాంక్రీట్ తొలగిస్తామని వీఆర్వోకు తెలియజేశారు.

గురజాడ కళాక్షేత్రంలో నేడు ప్రవచనాలు



మాట్లాడుతున్న వెంకటరావు

బీచ్ రోడ్డు: సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో శుక్రవారం సద్గురు మాతా సుదీక్షాజీ మహారాజ్ చేత నిరంకారి సంత్ సమాగం ప్రవచనాలు ఉంటాయని సంత్ నిరంకారీ మిషన్ ఉపాధ్యక్షుడు పి.వెంకటరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగే ఈ ప్రవచనాల్లో భగవంతుని గొప్పతనం, నమ్మకం, జాతి, మత కుల వివక్షత లేని జీవనం కోసం వివరించనున్నారన్నారు. ఈ ప్రవచనాలకు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారమ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మద్దిలపాలెం: ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1లోని మంగాపురం కాలనీ ఫీడర్ పరిధిలో భూగర్భ విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ జి.వి.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగాపురం కాలనీ, శివాజీపాలెం, లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలి

- పరిశ్రమ విక్రయానికి ఏజెంట్‌గా జీవీఎల్
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విక్రయానికి ఒక ఏజెంట్‌గా బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు వ్యవహరించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఉత్తరాంధ్రపై అమితమైన ప్రేమ ఉన్నట్టు జీవీఎల్ వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపుపై ఏనాడు చర్చించలేదన్నారు. కావాలనే స్టీల్ ప్లాంట్ నష్టాలను చూపిస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి కేవలం రూ.5వేల కోట్లు అని, పన్నుల రూపంలో ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లు అందుకున్న విషయాన్ని దాచిపెడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ స్టీల్‌ప్లాంట్‌పై సవతి ప్రేమ చూపిస్తూ దాన్ని నష్టాలను భర్తీ చేసుకోవడానికి హెచ్‌బీ కాలనీలోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లు ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు ఇవ్వాలని సూచించడం సమంజసంగా లేదన్నారు. అదాని, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న కేంద్రం.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు ఆర్కే ఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

ఏయూకు ఎస్‌బీఐ విరాళం



చెక్కు అందిస్తున్న చీఫ్ మేనేజర్ అపర్ణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన సౌత్ ఇండియా వర్సిటీల వీసీల సమావేశానికి ఎస్‌బీఐ ఏయూ శాఖ రూ.2 లక్షలు విరాళంగా అందించింది. సమావేశ నిర్వహణకు సహకారం అందిస్తామని గతంలో తెలియజేసిన బ్యాంక్ అధికారులు, చెప్పిన విధంగా విరాళం అందించారు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జంధ్యాల అపర్ణ విరాళ చెక్కును అందజేశారు. అనంతరం ఈ చెక్కును ఆచార్య కృష్ణమోహన్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అందించారు.

తప్పిన పెనుప్రమాదం

అదుపుతప్పి పండ్ల దుకాణంలోకి దూసుకుపోయిన కారు



హైవేపై విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిన కారు

సీతమ్మధార: పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పోర్టు స్టేడియం ఎదురుగా జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి పండ్ల దుకాణంపైకి దూసుకుపోయిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. హైవేపై గురుద్వారా జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం సిగ్నల్ వైపుగా లారీతోపాటు కారు వెళ్తున్నాయి. పోర్టు స్టేడియం సమీపంలో కారు లారీని దాటుకొని ముందుకెళ్లింది. ఆ సమయంలో లారీ ఫుట్ ట్రస్ట్ కారు వెనుక భాగానికి తగలడంతో ఒక్కసారిగా కారు నడుపుతున్న వ్యక్తి స్టీరింగ్ ఎడమ చేతి వైపు తిప్పడంతో అదుపుతప్పింది. పక్కనే ఉన్న పండ్ల దుకాణంలోకి దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

సిరులతల్లికి తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు.

‘మానవత-నైతికత’పై రాష్ట్రవ్యాప్త జాగృతి ఉద్యమం

దాబాగార్డెన్స్: జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 20 వరకు ‘మానవత-నైతికత’పై రాష్ట్రవ్యాప్తంగా జాగృతి ఉద్యమం చేపట్టనున్నట్టు సంస్థ ప్రతినిధులు షేక్ మక్బూల్, జియా ఆలీఖాన్, మహ్మద్ ఇబ్రహీం తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని మహారాణిపేటలో గల ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ కార్యాలయంలో జాగృతి ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నా, మానవతా విలువలు నానాటికీ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం నిత్యం అశాంతి, అలజడికి గురవుతుందని, అందుకు నిదర్శనం నేడు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలేనని పేర్కొన్నారు. సమాజంలో ఈ భావన పెంపొందించే ఉన్నత లక్ష్యంతోనే ఇస్లామి హింద్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ, వివిధ ప్రత్యేక రంగాలకు సంబంధించిన ప్రముఖులతో చర్చా గోష్టులు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఆధ్యాత్మిక గురువులతో సమావేశాలు, వ్యక్తిగత పరిచయాలు, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ ఇబ్రహీం, షేక్ సిరాజ్, రహ్మతుల్లా, బషీరుద్దీన్, డాక్టర్ యాసీన్‌ఖాన్, హామీద్ బాష, వాహిక్ రజా, అబ్దుల్ సలాం, అహ్మద్, షేక్ బాజీబాబా పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళారంగ ప్రముఖులు

దాబాగార్డెన్స్: స్వర గీతిక సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో ‘ఒకసారి కలలోకి రావయ్యా’పేరిట 3 గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన సంగీత విభావరిని కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, సంస్థ వ్యవస్థాపకుడు పట్నాల రాజారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరానికి చెందిన గాయకులు రాజారావు, పల్లా వెంకటేష్, శ్యాంసుందర్, ఎస్ఎస్ఎన్ రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మహ్మద్ ఖాన్, శివకోటి జగదీష్, లోకేష్, దేవదాసు, రాము, వీవీఎన్ మూర్తి, గాయనీమణులు కందర్ప రాధ, గౌరీ, మాధురి, కుమారి, మను, శ్రీదేవి, జాస్మిన్, లయ, ఆదిలక్ష్మి తదితరులు అనేక యుగళగీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి పరమావధి



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఏయూ క్యాంపస్: ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 20వ వార్డు చిన వాల్తేరు కొయ్య వీధి, మధుర వీధి, ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ముచ్చల లక్ష్మితో కలసి అక్కరమాని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చల సురేష్, మద్ది పోలిరెడ్డి, రాయన పాపారావు, గుంటుబోయిన నరేష్, గొలగాని జ్యోతి, దిల్ రాజ్, సాయి, వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్‌పర్సన్ దాసరి పండరిబాయ్, యనంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రమాదేవి, సుబ్బమ్మ, దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా.. రహదారులా!



స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై డంప్ చేసిన గృహ వ్యర్థాలు

ఆరిలోవ: పాత భవనాల వ్యర్థాలతో రోడ్లు నిండిపోతున్నాయి. ఎక్కడికక్కడ రోడ్ల పక్కన భవన శిథిలాలను డంప్ చేసేస్తుండంతో డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. గతంలో ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లలో వీటిని గుట్టలు వేసేవారు. ఇటీవల ఆ రోడ్లలోకి లారీలకు ప్రవేశం లేకుండా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం వైపు మూడు చోట్ల ఇనుప గేట్లను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసి గృహ వ్యర్థాలు వేయకుండా నియంత్రించారు. దీంతో ఇప్పుడు బయట రోడ్లపై యథేచ్ఛగా డంప్ చేసి వెళ్లిపోతున్నారు. ఆరిలోవ, ముడసర్లోవ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ గుట్టలుగా ఈ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఆరిలోవ కాలనీ, హెల్త్ సిటీ రోడ్లతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ఎదురుగా ఉన్న డబుల్ రోడ్డు పక్కన కూడా కొద్ది రోజులుగా ఈ వ్యర్థాలను పడేస్తున్నారు. ఆరిలోవతో పాటు బయట ప్రాంతాల నుంచి సైతం గృహ వ్యర్థాలను లారీలతో తీసుకొచ్చి రాత్రి వేళ రోడ్ల పక్కన డంప్ చేస్తున్నారు. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఈ మార్గాలు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం వెళ్లేవారితో సందడిగా ఉంటుంది. ఇలాంటి రోడ్లపై వ్యర్థాలు డంప్ చేసి, అస్తవ్యస్తంగా తయారు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గృహ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేఆర్ఎం కాలనీలో చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని కేఆర్ఎం కాలనీలో నిర్మించిన బైబిల్ మిషన్ సెయింట్ దేవదాస్ చర్చిని గురువారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లరపు జాన్‌వెస్లీ ప్రారంభించారు. మాదే సుందరమ్మ, రెవరెండ్ మాదే సుకుమార్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ చర్చి ప్రారంభం అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవులు అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. దేవుని మాటలను మనందరం ఆచరించాలని ఉపదేశించారు. 40 ఏళ్ల క్రితం చిన్నది ప్రారంభమైన ఈ చర్చి నేడు మహావృక్షంగా ఎదిగిందన్నారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, పి.జీవరత్నం, పూలా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ 32వ వార్డు అధ్యక్షుడు రంది గోపాలకృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన



మాట్లాడుతున్న సామవేదం షణ్ముఖ శర్మ



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని భద్రం పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 208 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సామవేదం షణ్ముఖశర్మ పర్యవేక్షణలో ఈ మహోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 208 మంది మహిళలు గాయత్రీదేవి ఆశీస్సుల కోసం సామూహిక కుంకుమార్చన జరిపారు. ఈ కార్యక్రజుమంలో శ్రీకందాల శ్యామ్ స్వామి, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన మేధోశక్తి అవసరం

పిల్లల్లో క్రమశిక్షణతో కూడిన మేథోశక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని సామవేదం షణ్ముఖ శర్మ చెప్పారు.

ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక పరమైన శాంతియుత జీవనంతోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. ఎంతో విశిష్టత కలిగిన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీయులు సైతం పెద్ద ఎత్తున అనుసరిస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు అలరించాయి.